టీఎమ్మార్పీస్ మండల అధ్యక్షునిగా అశోక్



నవతెలంగాణ-కెరామెరి

టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా గోగర్ల అశోక్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం టీఎమ్మార్పీ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెన ధర్మయ్య, మోతె లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షునిగా ఎన్నికైన గోగర్ల అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల జిల్లా కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. మాదిగ ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు మహేష్, గోగర్ల వెంకటి, రాంచందర్, గంగాధర్ పాల్గొన్నారు.

బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో చిన్నారుల ప్రతిభ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ పట్టణంలోని వాసవి వరల్డ్ పాఠశాలలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తేజేందర్ సింగ్, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుణమాఫీ.. ఇంకా కాదేమీ..!

- సాంకేతిక సమస్యలకు లభించని పరిష్కారం
- ప్రభుత్వానికి చేరిన బాధిత రైతులకు జాబితా
- ఇప్పటికీ ఖాతాల్లో జమకాని మాఫీ సొమ్ము
- అర్హులైన వేలాది మంది అన్నదాతల్లో అయోమయం

రైతులను రుణమాఫీ చిక్కులు ఇంకా వీడటం లేదు. మాఫీకి అర్హులైనప్పటికీ సాంకేతిక తప్పిదాల కారణంగా మాఫీకి నోచుకోవడం లేదు. బ్యాంకులో తీసుకున్న రుణం మాఫీ కావడంతో అనేక మంది రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. వివిధ కారణాలతో మాఫీ జాబితాలో చోటు లభించని వారు మాత్రం నిరాశకు గురవుతున్నారు. సర్కారు నిబంధనల ప్రకారం మాఫీకి అన్ని విధాలా అర్హులైనప్పటికీ అనేక మందికి జరగకపోవడంతో తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం భరోసా కల్పించి సాంకేతిక తిప్పదాలను సరిచేస్తామని ఫిర్యాదులు స్వీకరించారు. నెల క్రితమే ఈ ప్రక్రియ పూర్తిచేసి ప్రభుత్వానికి పంపించారు. కానీ తాజాగా ప్రకటించిన రుణమాఫీ జాబితాలోనూ ఇంకా అనేక మంది రైతుల పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పటిలోగా పరిష్కారమవుతాయో అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.



తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన కొండ నర్సిములు. బ్యాంకులో రూ.1.60లక్షల అప్పు ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈయన రుణం మాఫీ కావాల్సి ఉంది. కానీ మాఫీ జాబితాలో పేరు లేకపోగా.. ఆన్‌లైన్‌లో వివరాలు కనిపించడం లేదని(డాటా నాట్ ఫాండ్) చూపిస్తోంది. సరిచేసుకునేందుకు సదరు రైతు సంబంధిత ఏఈఓకు వివరాలు అందించారు. కానీ పరిష్కారం మాత్రం కావడం లేదు. ఇలాంటి రైతులు ఆదిలాబాద్ జిల్లాలో అనేక మంది ఉండటం గమనార్హం.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అన్నదాతలకు ఆర్థిక అండ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ ప్రకటించింది. చెప్పినట్లుగానే మూడు విడతల్లో రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకు రుణం కలిగిన వారికి అనేక మంది రైతులకు మాఫీ చేసింది. చివరగా రూ.2లక్షలు కలిగిన వారికి చేయాల్సి ఉండగా.. ఇటీవల ఆ మొత్తాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేశామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో 55వేల మంది రైతులకు రూ.600కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ చాలా మంది అర్హులైన రైతులకు ఈ మాఫీ డబ్బులు జమ కాలేదు. మరోపక్క ఈ మాఫీ ప్రక్రియలో భాగంగా జిల్లాలో వేలాది మంది రైతులకు వివిధ తప్పిదాల కారణంగా రుణమాఫీ జరగలేదు. ప్రభుత్వ ఉద్యోగం ఉండటం..రేషన్‌కార్డు లేకపోవడంతో పాటు ఆధార్, బ్యాంకు ఖాతాల్లో దొర్లిన తప్పులు, బ్యాంకుల్లో తప్పిదాలు నమోదు చేయడం కారణంగా అనేక మంది రైతులకు మాఫీ జరగలేదు. ఈ విషయంపై అప్పట్లో రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం స్పందించింది. రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకోవడంతో పాటు రుణమాఫీ జరగని వారి వివరాలను సేకరించేందుకు ఏఈఓలతో సమగ్ర సర్వే చేయించింది. క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల కుటుంబాలను చిత్రం తీసి ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రక్రియ జరిగి సుమారు నెల రోజులు గడిచినా ఇంకా పరిష్కారంపై ఎలాంటి స్పష్టత లేకుండా ఉంది.

తప్పిదాలకు పరిష్కారం ఎప్పుడు..?

జిల్లాలో రుణమాఫీకి అర్హులై ఉండి మాఫీ కాని వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నెల రోజుల క్రితం గ్రామాలకు వెళ్లి సుమారు 18వేల మంది రైతులకు సంబంధించి సమగ్ర వివరాలు సేకరించారు. వారి ఫోటోలు..వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇందులో సుమారు 6600 మంది రైతులు అర్హులుగా గుర్తించి జాబితా రూపొందించినట్లు తెలిసింది. వీరికి సంబంధించి రూ.78కోట్ల వరకు జమ చేయనున్నట్లు సమాచారం. వీరితో పాటు మరో 3వేల మంది రైతులు సాంకేతిక తప్పిదాల కారణంగా మాఫీ జరగలేదని అధికారులకు ఫిర్యాదులు అందించారు. వీటిని ప్రభుత్వానికి పంపించినప్పటికీ పరిష్కారం కాలేదు. ప్రభుత్వం ఇటీవల రూ.2లక్షల వరకు రుణం కలిగిన వారికి సైతం సొమ్ము జమ చేసినట్లు చెబుతోంది. కానీ జిల్లాలోని రైతులకు మాత్రం వారి ఖాతాల్లో జమ కాలేదని తెలుస్తోంది. మొత్తం అన్ని అర్హతలు ఉండి.. రుణమాఫీ జరగని రైతులు సుమారు 7వేల నుంచి 10వేల మంది వరకు ఉంటారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోపక్క మహారాష్ట్ర బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన తమకు ఇప్పటికీ మాఫీ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం..ఉన్నతాధికారులు దృష్టిసారించి అర్హులైన రైతులకు రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి జాబితా పంపించాం

శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నెల రోజుల క్రితమే రుణమాఫీ కోసం 18వేల మంది కుటుంబాలకు సంబంధించి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశాం. మరో మూడు 3వేల మంది వరకు రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదులు అందించారు. ఇలాంటి వారి వివరాలన్ని ప్రభుత్వానికి అందించాం.

వేరువేరు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలో వేరువేరు చోట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గూడెం గ్రామానికి చెందిన బొయిరే భీమయ్య ద్విచక్ర వాహనంపై చిత్తం వైపు వస్తుండగా వెనకాల నుండి వస్తున్న మహారాష్ట్రకు చెందిన కారు ఢీకొట్టంతో కాలు ఫ్రాక్చర్ అయింది. దీంతో కుటుంబీకులు వెంటనే అతన్ని హాస్పిటల్‌కు తరలించారు. ఢీ కొట్టిన కారు డ్రైవర్ గమనించకుండానే కర్జెల్లి వరకు రాగా ఆ గ్రామానికి చెందిన కొందరు కారును వెంబడించి, పోలీసులకు సమాచారం ఇచారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన రామగిరి వెంకటేష్ బైక్‌పై నిత్యాసవర సరకులు తీసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎస్సీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంతో ఆయన కాలు విరిగింది. గాయపడిన వెంకటేష్‌ను తరలించారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన సాగించే ప్రభుత్వాలకు మనుగడ ఉంటుందని, గతం బీఆర్ఎస్ మదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ కూడా హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణ శంకర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పట్టణ విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ముందుగా ఈనెల 26న నిర్వహించే పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవంపై చర్చించి గ్రామగ్రామన పార్టీ జెండాలను ఎగరవేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజ మనోభావాలకు వ్యతిరేకంగా పాలన సాగించడంతో ప్రజలు ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం అవుతున్న ఇచ్చిన వాగ్దానాలను సక్రమంగా అమలు చేయడం లేదని, రైతులు, కార్మికులపై ఎలాంటి చిత్తశుద్ధి చేపలేదన్నారు. ఫ్రెండ్లీ పార్టీగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అదే విధంగా పార్టీ డిసెంబర్ 26న వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతుందన్నారు. ఆ రోజు గ్రామ గ్రామన అరుణ పతకాలను ఆవిష్కరించేలా పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు ప్రణాళికలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు విలాస్, ముడుపు నళినిరెడ్డి, నాయకులు దేవేందర్, అరుణ్ కుమార్, కట్ట కిష్టయ్య ఉన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులు 18 సంవత్సరాలుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వర్తించారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ విస్మరించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ఆరోపించారు. సమస్య పరిష్కారం కోసం ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఎన్టీఆర్ చౌక్‌లో సడక్ పే ఖానా.. రెగ్యులర్ హోనా నినాదంతో సహపంక్తి భోజనాలు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. వీరి నిరసనకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత ఎన్నికల్లో తాము అధికారం వస్తే ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ వేతనాలతో మహిళలు కూడా ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగులను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. ఇక్కడ అమలు చేయడానికి ఇబ్బందులేంటని ప్రశ్నించారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుదని గురించి, కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్లి అండగా ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీరి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలువురి సంఘీభావం...

మూడో రోజుకు చేరిన దీక్ష శిబిరానికి పలువురు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఇందులో పీఆర్టీయూ టీఎస్, జిల్లా నాయకులు ఆరే భాస్కర్, డి.గవర్దన్, గౌరవాధ్యక్షులు, వినోద్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, ప్రభాకర్, టీయూపీఎస్ అధ్యక్షులు సునీల్ చౌహాన్, వి.గోపికృష్ణ, సంగీత, నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అలాగే సీపీఐ(ఎం) ఆదిలాబాద్ ఏరియా కమిటీ తరపున లంక రాఘవులు ఏపీసీ కార్యదర్శి ఆశన్న, గంగారాం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియంక, రాజన్న, శ్రీకాంత్, బోజన్న పాల్గొన్నారు.



గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరేజ్ మొయినోద్దిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ హయంలో కేసీఆర్ స్థాపించిన గురుకులాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులను నిర్లక్ష్యం చేస్తుందని, దాని కారణంగా విద్యార్థులు మరణిస్తున్న పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరేజ్ మొయినోద్దిన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురుకుల బాటలో గుర్తించిన పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో అనేక సమస్యలున్నాయని తెలిపారు. ఉట్నూర్ మైనార్టీ గురుకులంలో విద్యార్థులు చర్మ వ్యాధులతో బాదపడుతున్నారన్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సంవత్సర కాలం సంబరాలు చేసుకోవడం కాదు. వసతి గృహాల్లో అధికారులు పర్యవేక్షిస్తే విద్యార్థుల సమస్యలు వారి దృష్టికి వస్తాయన్నారు. రాజకీయాలు చేయడానికి సమయం ఉందని, కేసీఆర్ గుర్తులను చెరిపేస్తామని చెప్పిన సీఎం రేవంత్ వర్గానికి అనుగుణంగా తొలుత గురుకులాలను నిర్వీర్యం చేయడంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. అదే విధంగా వాంకిడిలో ఫుడ్ పాయిజన్ ఘటనలో విద్యార్థి మృతి సంచలంగా మారడంతో పరిహారంతో పాటు చికిత్సల వివరాలను అధికారులు తెలియజేశారన్నారు. రాష్ట్రంలో 48 మంది వరకు విద్యార్థులు చనిపోయారని వారి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గురుకులా బాట ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వానికి నివేధిస్తామన్నారు. అప్పటికి పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కార్మికులకు పథకాలను పెంచాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికశాఖ ద్వారా వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు పథకాలను పెంచి ఇవ్వాలని విశ్రాంత లేబర్ అధికారి జగదీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం కార్మికులతో కలిసి ఆదివారం అంబేద్కర్ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మికశాఖ అధికారి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కార్మికశాఖ మండలి నుంచి కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత 20 సంవత్సరాలుగా సంక్షేమ పథకాలను పెంచకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కార్మిక శాఖ నాయకులు సంప్రదించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు కార్మికుల సంక్షేమమం, బాగోగులపై చిత్తశుద్ధి లేదన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు పెంచడం వల్ల రాష్ట్ర ఖజనాపై ఎలాంటి నష్టం వాటిల్లదని తెలిపారు. అయిన ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కార్మికులకు పథకాలు పెంచే వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా దుకాణాల్లో పని చేసే కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా సంతాజి జగ్నాడే మహారాజ్ జయంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గాండ్ల తేలి కులస్తుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సంతాజి జగ్నాడే మహారాజ్ 400వ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వాంకిడి మండల కేంద్రంలో, జిల్లా కేంద్రాల్లో విగ్రహాన్ని ఆవిష్కరించినంతరం జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్ నుండి ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి ప్రేమల గార్డెన్ మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సంతాజి బాటలో నడుస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, సంఘం రాష్ట్ర సమన్వయ సమితి అధ్యక్షులు సంగెం రవి కుమార్, గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరాజం, మధుసూదన్, జిల్లా యూత్ అధ్యక్షులు భూమేష్, సింగిల్ విండో ఛైర్మెన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ యాదవ్, బాలేష్ గౌడ్, చరణ్, బొనగిరి సతీష్, కేశవ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, రాష్ట్ర తేలి సంఘం యువజన అధ్యక్షులు హివ్రే సందీప్, ఉపాధ్యకులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆకాష్, మండల అధ్యక్షులు మురళి, బాలేశ్, మాజీ సర్పంచ్ తుకారాం, మాజీ ఎంపీటీసీ, నాయకుడు మారుతీ పటేల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం 1993-94 ఎసెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సమ్మేళన కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు నారాయణ, భాస్కర్, రమేష్, ఆనందిశ్వర్, గంగామణి, చంద్రయ్య రమేష్, వీరయ్య రాజిరెడ్డి లు పాల్గొన్నారు. ముందుగా పూర్వ విద్యార్థులు గురువులను ఘన స్వాగతం పలికారు.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పూర్వ అధ్యాపకులు వారి అనుభవాలను, అనుభూతులను విద్యార్థులతో పంచుకున్నారు. 30 ఏండ్ల తరువాత కలిసిన పూర్వవిద్యార్థులు ఒకరికొకరు కలుసుకుంటూ పాత జ్ఞపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆదిల్ షేక్, సంబన్న చిన్నయ్య, డాక్టర్ శ్రీధర్, రాజానర్సింలు, రహేమాన్, అజీమ్, దేవిదాస్, సరితా, మంజుల, రజిని, అనిత పాల్గొన్నారు.

ఆరోగ్య అలవాట్లతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్య అలవాట్లను సక్రమంగా పాటిస్తే ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు రావని, వయోవృద్ధులు దాన్ని అనుసరించాలని జిల్లా సంక్షేమ అధికారిణి సబిత అన్నారు. ఆదివారం వయోవృద్దుల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన 99 ఏండ్ల వయోవృద్ధురాలు చిల్వేరి నర్సుబాయిని ఇంటి సందర్శించి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంక్షేమ అధికారిణిని ఆమెను శాలువతో సన్మానించారు. 99 ఏండ్ల వయస్సులో కూడా ఎలాంటి బీపీ, షుగర్ లేకుండా నర్సుబాయి ఉనారన్నారు. ఇది ఆమె రోజు తీసుకునే ఆహారంతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ పోశెట్టి, సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, సభ్యులు పల్ల సత్యనారాయణ ఉన్నారు.



గ్రంథాలయం ప్రారంభం

నవతెలంగాణ-బేల

మండలంలోని ఆవాల్‌పూర్ గ్రామంలో మన పల్లె స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సామాజిక గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బద్దం నర్సింగ్‌రెడ్డి, గ్రామస్తులు మినక సుధాం రెడ్డి, నగేష్‌రెడ్డి, సురేష్, నరేందర్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

సీఆర్టీల వేతనాలు విడుదల చేయాలి : సచిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న సీఆర్టీల 5 నెలల వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించేదుకు కృషి చేస్తున్న సీఆర్టీలకు వేతనాలు విడుదల చేయక పోవడం సిగ్గు చేటని పేర్కొన్నారు. తక్షణమే 5 నెలల వేతనాలు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. వేతనాలు 5 నెలల నుం,ఇ లేకపోవడంతో కుటుంబ పోషణ, ఇతర ఆర్థిక సమస్యలు వారిని వేధి స్తున్నాయని పేర్కొన్నారు. ఐటీడీఏ పీఓ ప్రత్యేక చొరవ చూపించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు.

వార్షికోత్సవానికి హాజరు కావాలి

నవతెలంగాణ-నేరడిగొండ



మండలంలోని బుద్దికొండ, తేజాపూర్ గ్రామంలోని శ్రీశబరి మాతాజీ ఆశ్రమంలో ఆదివారం నుంచి 12వ తేదీ వరకు జరిగే 29వ వార్షికోత్సవాలకు హాజరు కావాలని ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని మండల కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను గ్రామస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

నేడు ఛలో ఇంద్రవెల్లి



నవతెలంగాణ-ఉట్నూర్

ఇంద్రవెల్లిలో సోమవారం నిర్వహించే ఆదివాసులు పోరాట దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా సార్మేడి మెస్రం దుర్గు పటేల్, ఉట్నూర్ మాజీ ఎంపీపీ, గౌరవాధ్యక్షులు పంద్ర జైవంత్ రావ్, ప్రధాన కార్యదర్శి పుర్కా బాపూరావు అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదివాసీ చట్టాలు, హక్కులు, జీఓలను కాలరాస్తూ ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలపై, ఆదివాసులపై చేస్తున్న దాడులను తిప్పికొడుతూ ఆదివాసుల అస్తిత్వాన్ని కాపాడుకునే దిశగా డిసెంబర్ 9న ఇంద్రవెల్లితో పాటు హైదరాబాద్, ఢిల్లీలో కూడా ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసులు ఎక్కడికక్కడ జెండాలు ఎగురవేసి ఆదివాసీ అస్తిత్వ పోరాట దినోత్సవం జరుపుకుంటూ వస్తున్నారు. భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సలాం శ్యామ్‌రావు, సిడం సోనేరావు, తోడసం నాగోరావ్, గేడం మారుతీ పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్ట్‌జోరు.. పట్టించుకోని అధికారులు..



దేశిదారు రవాణ చేస్తూ పట్టుబడిన వారితో పోలీసులు(ఫైల్ ఫోటో)

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఆయా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని, వీధికొక బెల్ట్‌షాప్ కొనసాగుంతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్‌షాప్‌లను నియంత్రించాల్సిన అధికారులు పట్టింపు లేనితనంగా వ్యవహరించడంతో వారి వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. దీంతో గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యువతపై మద్యం ప్రభావం ఎక్కువగా పడుతుందని ఆరోపిస్తున్నారు. అదే విధంగా మండలం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో దేశిదారు, తాటికల్లు, ఈత కళ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వీటికి యువత బానిసై, పలువురు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.


కంది పంటకు పందుల బెడద



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆరుగాలం కష్టించి పండించిన పంటకు చేతి కొచ్చే సరికి పందుల బెడద తప్పడం లేదు. గత వారం రోజుల కింద కాత పూత వచ్చిన కంది పంట ప్రస్తుతం కాయ దశలో ఉంది. ఐతే ఇటీవల అడవి పందుల స్వైర విహారం చేసి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతన్న ఖరీఫ్ సీజన్‌లో పత్తి, సోయా పంటలో అంతర పంటగా కంది పంటను సాగు చేశారు. కాయలు వచ్చే సరికి రాత్రి వేళల్లో అడవి పందులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతన్న రాత్రి వేళల్లో పంటను కాపాడేందుకు కాపలా కాస్తున్నారు. కొందరేమో సోలార్ తీగలు అమర్చి పంటను రక్షించుకుంటున్నారు. సోలార్ లేని వారు ప్రతి రోజు జాగారాం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు అడవి జంతువులు మనుషులపై దాడి చేస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. అడవి పందుల దాడిలో నష్ట పోయిన పంటకు అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించి, నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

కప్పుకున్న పొగమంచు వాహనదారులకు ఇక్కట్లు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాతావరణం కారు మబ్బులతో మేఘావృతమైంది. వేకువ జామున పొగ మంచుతో ఓ కశ్మీర్‌ను తలపిస్తోంది. తెల్లారే సరికి వాహనదారులు మంచుతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిపై పొగ మంచు కప్పేయడంతో ఎదురుగా వస్తున్న వాహనదారులకు ఏమి కనిపించక పోవడంతో హెడ్ లైట్లను వెలిగించి, ప్రయాణించారు.

రోడ్డు వెడల్పులో ఇల్లు పోయింది

- డబుల్ బెడ్ రూం ఇల్లు ఇస్తామని మోసం
- నేల మట్టమైన ముప్పై ఏండ్ల శ్రమ
- ఇందిరమ్మ ఇల్లుపై ఆశలు పెంచుకున్న బాధితుడు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

నీకు డబుల్ బెడ్ రూం ఇల్లు, నీ కొడుకుకు ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ జాబ్ ఇస్తాము. పట్టణంలో చేస్తున్న రోడ్డు వెడల్పులో ఎలాంటి ఆటంకం కలిగించకుండా స్వయంగా నీవే ముందుకు వచ్చి కూల్చివేతకు సహకరించాలి. ఇలా సంతృప్తి చెందే మాటలతో మభ్యపెట్టి చివరికి సదరు బాధితునికి ఏమీ ఇవ్వకుండా చేతులెత్తేసిన నాయకుల తీరు ఇది. ముప్పై ఏండ్లుగా బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ పైసా పైసా కూడగట్టుకుని, కొనుక్కున్న చిన్నపాటి గదిని కూల్చేసి చేతులెత్తేసిన నాయకుల మోసాన్ని సదరు బాధితుడు జీర్ణించుకోలేకపోతున్నాడు. ఎవరు కలిసినా తనకు జరిగిన అన్యాయం గురించి వివరిస్తూ కన్నీళ్ల పర్యంతమవుతున్నాడు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని సాయినగర్‌లో నివాసం ఉండే శంకర్ విద్యానగర్‌లో గత 30 ఏండ్ల కింద ఓ పెంకుటిల్లు గదిని కొనుగోలు చేసుకొని, అందులో తన కులవృత్తి లాండ్రీ షాపు నడుపుకునేవాడు. పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన క్రమంలో రెండేండ్ల క్రితం ప్రభుత్వం రోడ్డు వెడల్పుకోసం చర్యలు చేపట్టింది. విద్యానగర్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ఉన్న దుకాణ సముదాయాలు, ఇండ్లు, షెడ్లను కూల్చివేసింది. అదే క్రమంలో శంకర్‌కు చెందిన లాండ్రి షాపును కూడా కూల్చేశారు. పలువురి భవనాలు, వ్యాపార సముదాయాలు కొంత వరకు పోయినా భారీగా డిమాండ్ ఉన్న ప్రాంతం కావడంతో వారికి అంతగా నష్టం జరగలేదు. శంకర్ షాపు మాత్రం ఒక్క అడుగు స్థలం కూడా మిగులకుండా రోడ్డు వెడల్పులో నేలమట్టమయింది. దీంతో తన జీవనోపాదికి ఆసరగా ఉన్న లాండ్రీ షాపు లేకుండా పోవడంతో శంకర్ పరిస్థితి దీనంగా మారింది. రోడ్డు వెడల్పులో సహకరించిన శంకర్‌కు డబుల్ బెడ్ రూం ఇల్లు, కుమారునికి జాబు ఇస్తామని అప్పటి ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ మాట ఇవ్వడటతో వారి మాటలను విశ్వసించిన ఆయన ఏడాది క్రితం జరిగిన ఇండ్ల పంపిణీ ప్రక్రియదాకా ఎదురు చూశాడు. ఇండ్ల పంపిణీలో ఆయనకు మాత్రం ఇల్లు కేటాయించలేదు. రోడ్డు వెడల్పులో నష్టం జరిగిన పేదలకు డబుల్ బెడ్ రూం ఇవ్వాలనే నిబంధన ఉన్నప్పటికిని అప్పటి నాయకులు ఆయనకు ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదో అంతుపట్టని ప్రశ్నగా మారింది. తనకు మాట ఇచ్చిన అప్పటి ఎమ్మెల్యే రేఖానాయక్‌ను, చైర్మెన్ రాజేందర్‌ను పలుమార్లు కలిసినా ఫలితం లేకపోవడంతో ఆయన నిస్సహాయునిగా ఉండిపోయాడు. తనకు జరిగిన అన్యాయం గురించి ఇప్పటికీ శంకర్ నాయకులను కలిసి వేడుకుంటూనే ఉన్నాడు. శంకర్‌కు జరిగిన అన్యాయం గురించి అప్పుడు కౌన్సిలర్ గా ఉన్న ప్రస్తుత మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, పలువురు సభ్యులు సైతం ఆ అంశాన్ని ప్రస్తావించేరు. మాట ఇచ్చిన ప్రకారం ఆయనకు న్యాయం చేయాలని అప్పటి చైర్మెన్‌ను పలు సందర్భాల్లో నిలదీశారు. అప్పటి ప్రభుత్వం, పాలకులు మారారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేస్తారన్న ఆశతో ఆయన ఎదురు చూస్తున్నాడు. ప్రస్తుత ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం తనకు న్యాయం చేస్తారన్న నమ్మకంతో ఉన్నాడు. చాకలి వృత్తితో ఉపాది పొందే శంకర్‌కు ఈ ప్రభుత్వంలో నైనా న్యాయం జరుగుతుందో లేదో చూడాలి.



అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

నవతెలంగాణ-బేల



మండల కేంద్రంలోని శ్రీకర్ సూపర్ మార్కెట్‌లో ఈనెల 4న జరిగిన భారీ చోరీ కేసులో 8 మంది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు సీఐ డి.సాయినాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 4న బేల మండల కేంద్రంలోని శ్రీకర్ సూపర్ మార్కెట్‌లో రూ.5లక్షల ఎనభై ఏడు వేలు చోరీ జరిగింది. దీనిపై సూపర్ మార్కెట్ యజమాని స్వరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం, దివ్యభారతిలు పరిశీలించారు. దొంగతనం కేసును ఎలాగైనా చేధించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్‌లతో రెండు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. దొంగతనం జరిగిన సూపర్ మార్కెట్, బేల మండల కేంద్రంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల ఫోటోలను చూసి మధ్యప్రదేశ్‌కు చెందిన అంతరాష్ట్ర ముఠాగా గుర్తించామన్నారు. వీరిపై నిఘా ఏర్పాటు చేసి వీరు చేస్తున్న పనులు కదిలికలు అన్ని గమనించి, ఆదివారం బేల బస్టాండ్ ప్రాంతంలో ముఠాను పట్టుకున్నామని తెలిపారు. వీరిని విచారించగా వీరు ఆదిలాబాద్‌లోని మావల ఏరియాలో చిన్న చిన్న గుడిసెలు వేసుకొని కుటుంబంతో సంచార జీవితం గడుపుతూ చుట్టుపక్కల ఊర్లలో పెద్ద మార్కెట్, సంతలు, జాతరలో చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ అక్కడ దొంగతనాలు చేస్తుంటారని విచారణలో తేలింది. బేలలోని సూపర్ మార్కెట్‌లో దొంగతనం చేసిన కేసులో రాజనాసి రాథోడ్, అభిషేక్ సింగ్ రాథోడ్, షారుక్, తాహిర్, రుషి, ఇద్దరు ఆడవాళ్ల బిజిలాబాయి, హీరాబాయి, ఒక మైనర్ బాలుడు అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.2లక్షల 41 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మిగతా డబ్బులు మధ్యప్రదేశ్ చెందిన అప్పాన వద్ద ఉన్నట్లు విచారణలో తేలింది. వీరిపై సిద్దిపేట, సిరిసిల్ల, హైదరాబాద్, నిర్మల్ జిల్లాలో దొంగతనం కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. ఇట్టి కేసును చాకచక్యంగా త్వరలో చేదించిన జైనథ్ సీఐ డి.సాయినాథ్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, బేల ఎస్సై దివ్య భారతి, సీసీఎస్ సిబ్బంది రుక్మారెడ్డి, జాకీర్, జోగేందర్ సింగ్, నరేష్, శ్రీనివాస్, రహత్, బేల సిబ్బంది జీవన్ కుమార్, సలీమ్, ప్రభాకర్‌లను ఎస్పీ గౌస్ ఆలం అభినందించారు.

మార్కెటింగ్ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించగా ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ వ్యవహరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ అజం అలీ, కార్యదర్శి గా పి.రామకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా కె.రాజేశ్వర్, జె.స్వామి, జాయింట్ సెక్రటరీలుగా షైక్ ఒసామా, కె.మాధవ్, అస్మ సుల్తానా, ట్రెజరర్‌గా ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్.శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.మనోజ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎన్.ప్రకాష్, ఎండి రషీద్, రైస ఖాతూన్, అడ్వైజర్‌గా అన్నెల అడెల్లును ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2024 నుంచి 2027 వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు వారికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. మార్కెటింగ్ కమిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఉద్యోగులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, రాష్ట్ర నాయకులు తిరుమల్‌రెడ్డి, తాలూకా కార్యదర్శి అరుణ్ కుమార్, మార్కెటింగ్ ఉమ్మడి జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

చట్టాలపై హాస్టల్ విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

సఖి కేంద్రం ఆధ్వర్యంలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమం నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు 16 రోజులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దిక్ష హాస్టల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖీ కేంద్రం నిర్వాహకులు మాట్లాడారు. మహిళల పట్ల హింసను నిర్మూలిద్దామని అన్నారు. హింసకు వ్యతిరేఖంగా మనం అందరం కలిసి పోరాడాలని అన్నారు. సఖి అందించే సేవలు కౌన్సిలింగ్, న్యాయ, వైద్య పోలీస్, తాత్కాలిక వసతి, బాల్య వివాహ చట్టం, ఫోక్సో చట్టం, సైబర్ క్రైమ్ గురించి కేస్ వర్కర్ ప్రవీణ, పారామెడికల్ హెల్త్ వర్కర్ సుకేష్ణ అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర సమయాలల్లో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098, 1930 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, బాలికలు పాల్గొన్నారు.



కొనసాగుతున్న సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఆదిలాబాద్‌రూరల్‌లోని యాపల్‌గూడ బోథ్ మండలం, మర్లపల్లి, బేల మండలాల్లో పలు గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు యాపల్‌గూడలో పాల్గొని మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహకాలు అందిస్తూ, విద్యార్థులు ప్రపంచ స్థాయికి చేరే విధంగా చేయాలనే సంకల్పంతో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రైబల్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటుకు చొరవ చూపాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆదివారం హైదారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ట్రైబల్ అడ్వైజరి కమిటీ ఏర్పాటుకు చోరువ చూపాలని, అలాగే ఏజెన్సీ ప్రాంతంలోని ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ప్రభుత్వ పెద్దలతో చర్చించి చొరవ చూపాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు జాదవ్ సుమేష్, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు రాజేష్ నాయక్, గోండ్‌వాన సేవాసమితి జేఏసీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

యూత్ కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడుగా షేక్ నసీర్, ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షునిగా కోలేట్కర్ పరమేశ్వర్ రెండు రోజుల కింద నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో వారితో పాటు కాంగ్రెస్ యూత్ మండల ప్రెసిడెంట్ ముభాషీర్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్‌లను కాంగ్రెస్ నాయకులు, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మండలాధ్యక్షులు దేవ్‌రావ్ లోఖండే శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ షేక్ దాదే అలీ, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, రాథోడ్ దత్తారాం, షేక్ అహ్మద్, షేక్ దస్తగిరి, కరీం ఖాన్, హసన్‌ఖాన్, షేక్ సత్తార్, జాకీరుల్లా ఖాన్, మహమ్మద్ ఖురేషి, మన్సూర్ ఖాన్, నరహరి, షేక్ హుస్సేన్, జాదవ్ కైలాస్, డిగాంబర్, జాకీర్, మైను, జావిద్ ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ జహీర్ కంటి ఆపరేషన్ చేసుకొని, ఇంటి వద్దనున్న ఆయనను ఆదివారం గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కరణ్‌సింగ్, రామ్ నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

వెల్మ సామాజికవర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలని లోకేశ్వరం మండల వెల్మ సంఘం నాయకులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుత పదవిలో ఉండి అసభ్య పదజాలంతో దూషించడంతో వెల్మ సామాజిక వర్గం మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. అహంకారపూరిత ఒక వర్గంపై దూషణలు చేయడం సరికాదని, ఆయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

శివాజీ చౌరస్తాలో వాహనాల తనిఖీ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో ఎస్సై ఇస్లావత్ నరేష్ ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజన సహకార చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గిరిజన సహకార సంఘం చైర్మన్ కోట్నాక తిరుపతికి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆసిఫ్ అలీ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిడాం గణపతి, బబ్లూ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే విద్యార్థులకు అవస్థలు

- బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి ముస్తఫా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే విద్యార్థులు గురుకులాలు, వసతి గృహాల్లో అవస్థలు పడుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి ముస్తఫా ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు గురుకులాల పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని విద్యార్థి విభాగం నేతృత్వంలో చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో 40కు పైగా గురుకులాలు, వసతి గృహాల్లో వారం రోజుల పాటు సందర్శించడం జరిగిందని తెలిపారు. ఎక్కడ చూసినా అపరిశుభ్రత నాణ్యతలేని భోజనం దర్శనమిచ్చాయన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఎంతోమంది విద్యార్థులు ఎలర్జీతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చల్లటి నీళ్ల స్నానం చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నట్టు తెలిపారు. అసౌకర్యాల మధ్య విద్యపై ఎలా దృష్టి పెడతారని ప్రశ్నించారు. విద్యాశాఖపై ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన శైలజ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల ప్రభుత్వ భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, పార్టీ మాజీ అధ్యక్షుడు గంధం శ్రీనివాస్, బృందం సభ్యులు రాజ్ కుమార్, తాజ్, సిర్పూర్ నియోజకవర్గం కన్వీనర్ శ్యాంరావు, మాజీ కౌన్సిలర్ మనోహర్, పట్టణ అధ్యక్షుడు హైమద్, నాయకులు నిసార్, రవి, భీమేష్, రాకేష్, శైలేష్, మహేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-కౌటాల

పోగొట్టుకున్న ఫోన్‌లను తిరిగి రికవరి చేసేల సీఈఐఆర్ పోర్టర్‌లో నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పి.హరీష్ రూ.15వేల విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ వివరాలను ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసి ట్రాక్ చేసి ఆదివారం హరీష్‌కు అందించారు.

ఆర్ఎంపీలపై ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకునేందుకే ఆర్ఎంపీపై ఆరోపణలు చేస్తుందని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్య కమిషన్ సభ్యుడు వెంకటేశ్వర్ ఆర్ఎంపీ వైద్యం చేయడంతోనే శైలజ ప్రాణప్రాయ స్థితికి చేరిందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేని ప్రభుత్వం గ్రామాలలో క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలందించే ఆర్ఎంపీలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. శైలజ మృతిపై ప్రభుత్వానికి అనుమానాలుంటే ప్రత్యేక కమిటీ వేసి కారణాలను తెలుసుకోవాలి కానీ ఇలాంటి చేతగాని ఆరోపణలకు చేయడం సరికాదన్నారు. ఆర్ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేస్తారని గుర్తు చేశారు. మంచిర్యాలలో ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం అందించిన విద్యార్థినికి అక్కడే హైడోస్ ఇంజక్షన్లు, మాత్రలు ఇచ్చి ఉండవచ్చని అది వదిలిపెట్టి తమపై ఆరోపణ చేయడం సరికాదన్నారు. విద్యా కమిషన్ సభ్యుడు మాటలతో విద్యార్థిని మృతిపై అనుమానాలు మరింత బలమవుతున్నాయన్నారు. శైలజ మృతదేహానికి రీ పోస్టుమార్టం చేసి అసలైన నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘం నాయకులు పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గమే మానవ కల్యాణ మార్గం

నవతెలంగాణ-వాంకిడి



మనిషి జీవనంలో సుఖమయ జీవితం గడపడానికి బుద్ధుడి మార్గమే మానవ కల్యాణ మార్గమని మహారాష్ట్రలోని నాగపూర్ చెందిన బంతే మహా థేరో సోమనాథ్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన 68వ ధమ్మచక్ర ప్రవర్తన దివాస్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1960 డిసెంబర్ 8న మండలంలో మొదటిసారి దీక్ష ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. భగవాన్ బుద్ధుని తత్వానమూలంగా భారతదేశంలో మనుషులు శిలవంతులుగా మారినారని, భిన్నత్వంలో ఏకత్వం తయారైందన్నారు. ప్రతి ఒక్కరు కర్తవ్యంతో మెదులుతేనే శాంతితో జీవనం సార్థకం అవుతుందన్నారు. దేశంలో పెరిగిపోతున్న స్వార్థం వల్ల అశాంతి పెరిగిందని, దయాగుణం అలవర్చు కోవడం వల్ల శాంతి విరాజిల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహారాష్ట్రలోని రాజుర పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు రాజుజీవన్, నాగోరావు పెద్వకార్, విలకబాయి ఉగ్రే, మండల బౌద్ధ మహా సభ అధ్యక్షులు జైరాం, జిల్లా నాయకులు విజయ్ ఉగ్రె, తిరుపతి, నిసేష్, శ్యామ్ రావు, మండల అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం సునీల్ , విలాస్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, జయంత్ కుమార్, విఠల్, రాజేశ్వర్, పాండు, అరుణ్, సందీప్, ప్రతాప్, ఇంద్రజిత్, శివాజీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

పులి ఆవాస అభివృద్ధికి ఏర్పాట్లు

- పీసీసీఎఫ్ డోబ్రియల్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పులుల సంచారం పెరిగిందని వాటి ఆవాస అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీ శాఖ పీసీసీఎఫ్ డోబ్రియల్ వెల్లడించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెర్రు, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, సీసీఎఫ్ రామలింగంతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులి మనుషులపై అనవసరంగా దాడి చేయదన్నారు. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాల నుండి పులుల రాక పెరిగిందన్నారు. ప్రస్తుతం పులులు ఆవాసం కోసం వెతుక్కుంటున్నాయని, కాగజ్‌నగర్ ప్రాంతంలో ఇది ఎక్కువగా ఉందని, దీనికోసం ఆ ప్రాంతాన్ని పులి ఆవాస కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రానున్న రోజుల్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎకో టూరిజం అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. గడ్డి భూముల అభివృద్ధికి, ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో పులి, ఏనుగు దాడులలో పలువురు చనిపోవడం బాధాకరమన్నారు. తడోబా నుండి కవ్వాల్ టైగర్ రిజర్వుకు జిల్లా క్యారిడార్‌గా ఉందని అయితే జిల్లాలో పులుల సంఖ్య పెరగడంతో అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కేవలం ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రమే అటవీశాఖలో సమస్యలున్నాయన్నారు. పులి సంచారానికి అవసరమైన ప్రాంతాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అటవీ సిబ్బందికి ఆయుధాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్టు తెలిపారు. పోలీస్ స్టేషన్ల వలే ప్రత్యేకంగా నిర్వహణ స్టేషన్లు లేకపోవడంతో ఆయుధాలు నిర్వహణ కూడా కష్టమేనన్నారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల సర్వేపై అడగగా తమ నుండి ఎటువంటి గైడ్ లైన్స్ పంపించలేదని, సర్వే చేయాల్సిన అవసరం లేదన్నారు. పులుల పట్ల వదంతులు ప్రచారం చేయొద్దని అలాగే పులులు అటవీశాఖ అధికారులు వదిలారని, సామాజిక మాధ్యమాల్లో రావడం విడ్డూరంగా ఉందన్నారు. పులులను పట్టుకోవాలంటే ఎన్‌టీసీఎస్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. పులులు ఒకేచోట గుంపుగా ఉండవని పుట్టిన తర్వాత 18 నెలలకు చిన్న పులులు తల్లి నుండి దూరంగా వెళ్లిపోతాయన్నారు, ఆడపులి ఎక్కువగా తిరగదని, మగ పులి వెయ్యి కిలోమీటర్ల దూరం తిరిగే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ వినయ్ కుమార్ సాహూ, ఎఫ్ఆర్‌ఓలు గోవింద్ సింగ్ సర్దార్, సరోజరాణి, జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతనాల పెంపు జీఓ విడుదల చేయాలి

- ప్రారంభమైన ఎండీఎం కార్మికులు ఆటో జాత



నవతెలంగాణ-రెబ్బెన

అసెంబ్లీ సమావేశాల్లో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపుకు సంబంధించి జీఓను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం(సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాడిగి మాయ అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఆటో జాతను ప్రారంభించారు. జిల్లా పరిషత్ పాఠశాల నుండి బస్టాండ్ ఏరియా వరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కోడి గుడ్ల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, వేతనాలు కూడ కేంద్రం, రాష్ట్రం వాటాలను వేరువేరుగా చెల్లించకుండా ఒకేసారి పూర్తి వేతనం చెల్లించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రెబ్బెన మండలం నుండి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై చేస్తున్న ఆటో జాత జిల్లా వ్యాప్తంగా 3 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. సోమవారం సిర్పూర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని చివరి రోజు మంగళవారం కెరామెరి, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో జాత కొనసాగుతుందన్నారు. అదే విధంగా డిమాండ్ల సాధనకు 16, 17 తేదిల్లో ఛలో కలెక్టరేట్ వంటవార్పు కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల అధ్యక్షురాలు విజయ, క్రిష్ణవేణి, సుజాత, పద్మ, రాజుబాయి, గౌరుబాయి, రూప్లీబాయి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

- రాష్ట్ర గిరిజన సంక్షేమ చైర్మన్ కొట్నాక తిరుపతి
- సంక్షేమ పథకాలు అందించడంలో ముందుంటాం



నవతెలంగాణ-బెజ్జూర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా పరిపాలన విజయోత్సవ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి ముఖ్య అథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎప్పుడు ముందుంటుందన్నారు. బీఆర్ఎస్ హయంలో ఉద్యోగం, ఇల్లు ఇవ్వకుండ కేసీఆర్ యువతను మోసం చేశారని, తాము వచ్చిన సంవత్సరం కాలంలోనే 56వేల ప్రభుత్వ ఉద్యోగాలను అందించామన్నారు. ప్రజల కోసం ఏర్పడ్డ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యమన్నారు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే 6 గ్యారెంటీలను అమలు చేశామని పేర్కొన్నారు. సంవత్సర కాలంలో ఎలాంటి అవినీతికి చోటు లేకుండా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామన్నారు. ప్రతి సంక్షేమ పథకం పేదల చెంతకు చేరుతుందన్నారు. రాష్ట్రంలో అట్టహాసంగా ఏడది పూర్తి విజయోత్సవాలు జరుగుతున్నాయన్నారు. నిరుపేదల అభ్యున్నతి కోసం ప్రజా ప్రభుత్వం ప్రతిక్షణం కృషి చేస్తుందన్నారు. త్వరలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హులను గుర్తించటానికి కలెక్టర్ ద్వారా సర్వే చేపట్టామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సంక్రాంతి తరవాత రైతులకు రైతు భరోసా ఇస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణలో భూసంస్కరణలు అమలయ్యాయన్నారు. మండల కేంద్రానికి వచ్చిన ఆయనకు ఘనస్వాగతం పలికి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ గణపతి, టీపీసీసీ సభ్యులు హర్షద్హుస్సేన్, మాజీ ఎంపీపీలు డబ్బులు నానయ్య, విశ్వనాథ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్, బెజ్జూర్ మాజీ సర్పంచ్ జగ్గా గౌడ్, మాజీ జడ్పీటీసీ పుష్పలత, నాయకులు సామల రాజన్న, సదాశివ్, నాహిర్‌అలీ, రాజన్న, ఆదివాసీ నాయకులు సోయం చిన్నయ్య, విశ్వేశ్వర్, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పద్మశాలీలు రాజకీయంగా రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలీలు రాజకీయ రంగంలో ఎదగాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు అన్నారు. కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గుండా శ్యామ్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ రంగంలో రాణిస్తే సంఘ సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు వారి సహకారంతో అభివృద్ధి చెందొచ్చున్నారు. ఆర్థిక వ్యాపార రంగాల్లోనూ రాణించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పద్మశాలీలకు రాజకీయ పార్టీలు సమూచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుండా శంకర్, నల్ల కనకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అనుమాండ్ల శ్రీకాంత్, అల్లే శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు కోమటిపల్లి లింగయ్య, సిరిపురం భద్రయ్య పాల్గొన్నారు.

10 నుండి ఎస్ఎస్ఏ ఉద్యోగుల పెన్‌డౌన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 10 నుండి విద్యాశాఖలోని సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చాక్‌డౌన్, పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసనలో మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10 నుండి పెన్‌డౌన్ నిర్వహించనున్నట్టు హెచ్చరించారు. 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నామని, పెరిగిన నిత్యావసర ధరల వలన బ్రతకలేక చస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భారత దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మోహన్, జిల్లా అధ్యక్షురాలు శృతిక, ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి సంతోష్ పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లోగా వర్గీకరణ అమలు చేయాలి

- టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మెన ధర్మయ్య



నవతెలంగాణ-కెరమెరి

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మన ధర్మయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం జనవరి 19న హైదరాబాద్‌లో జరిగే మాదిగల మహా గర్జనకు సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఆగస్టు మాసంలో ఎస్సీ వర్గీకరణ న్యాయమైందని సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు నిచ్చిందని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందే వర్గీకరణ చేపట్టే బాధ్యత తమ ప్రభుత్వానిదని ప్రకటించారన్నారు. అవసరమైతే ప్రత్యేక ఆర్డినేన్స్ తీసుకొచ్చి జారీ చేసిన ఉద్యోగ నియమాలకు వర్తింపచేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పునిచ్చి నాలుగు నెలలు గడుస్తున్న వర్గీకరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడమేంటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దన్నారు. విదేశీ విద్యా పథకంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూ.12 లక్షల అభయాసం పథకం వెంటనే అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ గృహాలను అర్హులైన నిరుపేదలకుఅందజేయాలన్నారు. అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి పట్టాలివ్వాలన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలనే డిమాండ్‌తో జనవరి 19న నిర్వహించే మాదిగల మహాగర్జను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోతె లక్ష్మణ్, గోగర్ల అశోక్, మాజీ ఎంపీటీసీ గోవర్ల రాజయ్య, తిరుసుల్లా సాయికుమార్, మహేష్, గంగాధర్, రాంచందర్, శ్రీకాంత్, వెంకటి, అజయ్, నగేష్, స్వామి పాల్గొన్నారు.

కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని జనకాపూర్ పద్మశాలి సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు సమక్షంలో చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుండే సంఘాలు ఏర్పాటు కావాలన్నారు. ఐక్యంగా ముందుకెళ్లాలని ఇందుకు కార్యవర్గ సభ్యులందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, శంకర్, మల్లయ్య, శ్రీకాంత్, లింగయ్య, భద్రయ్య, శ్యాం, శైలేందర్, మహేష్, సత్యనారాయణ, రమేష్, వేణు, భూదేవి, శిరీశ, మనమ్మ పాల్గొన్నారు.

సంఘం అధ్యక్షుడిగా సిరిపురం భద్రయ్య

గౌరవ అధ్యక్షులుగా వనమాల రవీందర్, అధ్యక్షులుగా సిరిపురం భద్రయ్య, ఉపాధ్యక్షులుగా గాజర్ల శైలేందర్, బండారి మల్లేశ్, కార్యదర్శిగా గుండా శ్యాం, సహాయ కార్యదర్శిగా మేన తిరుపతి, కోశాధికారిగా బుధారపు సత్యనారాయణ, చిప్ప మహేష్, ప్రచార కార్యదర్శులుగా కొలిపాక సత్యనారాయణ, పోరండ్ల నవీన్, హనుమాన్ల అంజన్న, పోరండ్ల మహేష్, నాగుల నరేష్ ఎన్నికయ్యారు.

పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిన్నింగ్ మిల్లులలో ఉత్పత్తి ఆగిపోయిన నేపథ్యంలో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువ అయినందున పత్తి కొనుగోలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలోని ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లిలలో 9, 10 తేదీలలో, సిర్పూర్, కౌటాల, జైనూర్‌లలో గల జిన్నింగ్ మిల్లులలో 9న ఒకరోజు పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడం జరుగుతుందని, తర్వాత యధావిధిగా కొనుగోలు జరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com

పడగల్ గ్రామంలో బోనాల సంబరాలు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

మండలంలోని పడగల్ గ్రామ శివారులో గల ఆదివారం నిర్వహించిన ఆది మల్లన్న జాతరలో స్కౌట్స్ అండ్ గైడ్ పదవ తరగతి విద్యార్థులు జాతరలో సెక్యూరిటీ నిర్వహించారు. బోనాలు డప్పు వాయిద్యాలతో భాజాభజంత్రీలతో గ్రామస్తులు ఆలయం వరకు బోనాలు తీసుకొచ్చి బోనాలు సమర్పించారు. అనంతరం ఐదుచుట్లు రథోత్సవం నిర్వహించారు. జాతరలో నైవేద్యాలు సమర్పించారు. జాతర సందర్భంగా విన్యాసాలు అందరినీ అలరించాయి. జాతర ఉత్సవాలు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో శ్రీ మార్కండేయ ఆలయ అభివృద్ధి ఆధ్వర్యంలో సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బుస శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఒమాజీ కిషన్, కార్యదర్శి కట్కం రవీందర్, కోశాధికారి తౌట్ కోటేష్, సలహాదారులు పర్పెల్లి నర్సయ్య, తాటికొండ నరేందర్, బొట్ల సంతోష్, చెలిమెల రమేష్ ఎన్నికయ్యారు. సమావేశం పంథా మెతరులు మామిడాల నవీన్, గుండు నాగరాజు, మేసరి నవీన్, అందె వెంకటగిరి సమక్షంలో ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ ఆదివారం ప్రారంభించారు. ఇందులో సుమారు 700 మంది విద్యార్థులు, 100 మంది మాస్టర్‌లు పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ద్వారా భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదవాడికి అందుబాటులో ఉన్న కల అంటే కుంఫూ అని ప్రతి ఒక్క విద్యారి తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించాలని అన్నారు. ముఖ్యంగా నేటి యుగంలో మహిళలపై జరుగుతున్నటువంటి అగైత్యాల నుండి తమను తాము కాపాడుకోవడానికి చాలా ఉపయోగ పడుతుందని అన్నారు. భోజన సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ధన్యవాదములు తెలిపారు. ఈ పోటీలలో జిల్లా నలు మూలల నుండి విద్యార్థులు రావడం చాలా ఆనందంగా ఉంది అని, ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఈ విద్యను ప్రతి విద్యార్థికి అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగళి రమేష్, కౌన్సిలర్ సురేష్ నాయక్, రంజిత్ సింగ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో నవవధువు మృతి

నవతెలంగాణ-తాండూర్



ప్రేమించిన వాడితో జీవితాంతం కలిసి సాగాలనే ఓ నవ వధువు కల అంతలోనే చెదిరిపోయిన విషాద ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండలలో చోటుచేసుకుంది. నెన్నెల మండలంలోని మారెమ్మ వాడకు చెందిన స్వప్న(20) నవ వధువు విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందింది. అదే మండలం పోచమ్మవాడకు చెందిన పల్ల సిద్ధుతో ఈ నెల 4న బెల్లంపల్లి శివాలయంలో పెద్దల సమక్షంలో ప్రేమ పెండ్లి చేసుకుంది. స్వప్న విద్యుత్ లేదనుకొని వాటర్ హీటర్‌ను ముట్టుకోవడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. స్వప్న స్నానం చెయ్యడం కోసం బకెట్లో నీళ్ల నింపి అందులో వాటర్ హీటర్ పెట్టింది. నీళ్ల వేడి అయ్యాయనుకొని, ఆ సమయంలో కరెంటు లేదనుకొని నేరుగా హీటర్‌ను పట్టుకుంది. దాంతో కరెంటు ఉండటంతో షాక్ కొట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళు తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పెళ్లయిన వారంలోపే నవవధువు మృతి చెందడంతో మృతురాలి బంధువులు కుటుంబ సభ్యుల విషాదం నెలకొంది. మృతిరాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు నెన్నెల ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

రేపు మండల స్థాయి సీఎం కప్ పోటీలు

నవతెలంగాణ-తాండూర్

మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు మంగళవారం జడ్పీహెచ్ఎస్ తాండూర్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకుని మండల స్థాయిలో పాల్గొనాల్సిందిగా కోరారు. వివరాలకు 9849998661, 9849234865 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యారంగ సమస్యల పరిష్కారానికై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 10న జరగబోయే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, డాక్టర్ కర్క గణేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ఎన్.ఆర్.భవన్ (నీలం రామచంద్రయ్య భవన్)లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌లతో ఈనెల 10న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలను విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజ్ రియింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీ.జీ, డిగ్రీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో అసంపూర్ణ భవన నిర్మాణాలు, గురుకుల సంక్షేమ వసతి గృహాలకు సొంత భవన నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పోరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని నూతన జేఎన్టీయూ సబ్ క్యాంపస్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విద్యార్థులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.అనిల్ కుమార్, జిల్లా నాయకులు మహిపాల్, నసీర్, రేహాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి మండల కేంద్రానికి కొత్తగా 108 అంబులెన్స్

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రానికి శనివారం నూతనంగా 108 అంబులెన్స్ మంజూరై నట్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సర్వీసు కావాలంటే సిరికొండ, ఇందల్వాయి లేదా డిచ్‌పల్లి నుంచి అంబులెన్స్ మనకు అందుబాటులో ఉండేదని, కానీ ఇప్పటి నుంచి ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా 108 అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని వివరించారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ధర్పల్లి మండల ప్రజలు అంబులెన్స్ వచ్చిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం..!

- తడిసిన ధాన్యంతో లబోదిబోమంటున్న రైతులు
- కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్
- తూకం వేసిన గోదాములకు తరలించడంలోనూ జాప్యం

అప్పటి వరకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం వర్షార్పణమైంది. ఎండలో ధాన్యం ఆరబోసి ఉండగా.. ఒక్కసారిగా వర్షం రావడంతో కాపాడుకోవడానికి ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా మారాయి. మంచిర్యాల జిల్లాలోని జన్నారం, తాండూరు తదితర మండలాల్లో ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన గోదాములకు తరలించాలని కోరుతున్నారు.



నవతెలంగాణ- జన్నారం

తుఫాను కారణంగా వాతావరణంలో మార్పులు సంభవించడం..ఒక్కసారిగా వర్షం రావడంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. రైతులు టార్పాలిన్ల సాయంతో భద్రపరిచినా పూర్తిస్థాయిలో కాపాడుకోలేకపోయారు. జన్నార మండలంలోని రాంపూర్ తిమ్మాపూర్ తపాలాపూర్, మహ్మదాబాద్ చింతగూడ రోటి గూడ, కవ్వాల్, కలమడుగు,ధర్మారం తదితర గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. కానీ కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండటం మూలంగా వర్షాలు రావడం.. ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు నష్టపోవాల్సి వచ్చింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క కోత దశకు వచ్చిన వరి వరి గింజలు వర్షానికి రాలిపోవడంతో సంబంధిత పంటలు కలిగిన రైతులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆలస్యంతోనే అనర్థం..!

ఈ సంవత్సరం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని రైతులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభిస్తే ఈ పాటికే ధాన్యం గోదాములకు చేరుకునేదని అంటున్నారు. ఒకపక్క రైతులకు గిట్టుబాటు ధర లేక, పెట్టుబడి ఎక్కువై బాధపడుతుండగా.. ఇలా అకాల వర్షం కారణంగా పండిన పంట కూఆడ పాడైపోయే పరిస్థితి రావడం పట్ల అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. నీటిలో తేలియాడుతున్న ధాన్యాన్ని ఆర బోసుకుంటున్నారు. తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు ఒక కళ్లలో నీళ్ల తిప్పుకుంటున్నారు. రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జునుగురి మల్లేష్, రైతు, తిమ్మాపూర్.



అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. లేకుంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా వెంటవెంటనే గోదాములకు తరలిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రెండెకరాల పొలంలోని వడ్లు హార్వెస్టర్ ద్వారా కోసి కుప్పగా పోసుకున్నాను. ఈ అకాల వర్షంతో వరి ధాన్యం కుప్ప పూర్తిగా తడిచిపోయింది.

ముందుగా ప్రారంభిస్తే నష్టం ఉండేది కాదు

బుచ్చిలింగం, రైతు, జన్నారం



ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించి ఉంటే రైతులకు ఈ నష్టం జరిగేది కాదు. కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాలను తడవకముందే వెంట వెంటనే లారీల ద్వారా గోదాములకు తరలించాలి. అప్పుడే నష్టాన్ని నివారించేందుకు ఆస్కారం ఉంటుంది.

12 మంది దొంగల ముఠ అరెస్టు

- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ప్రముఖ వైద్యుడి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన 12 మంది దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నట్టు మంచిర్యాల డీసీపీ ఏ బాస్కర్ తెలిపారు. ఆదివారం మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వైద్యుడు విజయ్ బాబు 30వ తేదిన కుటుంబ సభ్యులతో కలిసి ఓ జన్మదిన వేడుకలకు వెల్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో ఉన్న లాకర్ పగలగొట్టి ఉంది. అందులో ఉన్న రూ.15 లక్షలు, 44 తులాల బంగారం చోరీ అయినట్టు గుర్తించారు. వెంటనే మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం మంచిర్యాల పట్టణంలోని ముఖరం చౌరస్తాలో అనుమానస్పదంగా తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. డాక్టర్ ఇంట్లోకి చొరబడి లాకర్‌లో ఉన్న డబ్బులు, బంగారు ఆభరణాలు దొంగలించినట్లు అంగీకరించారు. నిందుతులు దొంగిలించిన సొమ్మును, బంగారాన్ని వాటాలు వేసుకొని పంచుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుండి దొంగిలించిన సొమ్ము బంగారంతో పాటు ఆటో, పల్సర్, స్ప్లెండర్ బైక్, హోండా యాక్టీవ స్కూటీలను స్వాదిన పరుచుకున్నట్లు తెలిపారు. కేసును చెందించుటలో చాక చక్యంగా వ్యవహరించిన మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్ రావు, సీసీఎస్ సీఐ కమలాకర్, ఎస్ఐ మదుసుధన్‌లతో పాటు సిబ్బందిని డీసీపీ అభినందించారు. సమావేశంలో ఏసీపీ ఆర్ ప్రకాష్ సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

అడవులపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-జన్నారం

జన్నారం అటవీ డివిజన్‌లోని ఇంధనపెల్లి అటవీ రేంజ్‌లో విద్యార్థులకు స్టడీ టూర్ నిర్వహించారు. మండలం కలమడుగు వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అడవులపై అవగాహన కల్పించారు. రేంజ్ పరిధిలోని ఇంధన్‌పెల్లి బేస్ క్యాంపు, గనిశెట్టి కుంట, మైసమ్మకుంట, ప్రాంతాలలో విద్యార్థులు ప్రయాణం చేసి అడవిలోని విశేషాలను తెలుసుకున్నారు. అడవుల రక్షణ, వన్య ప్రాణుల సంరక్షణ, అడవుల ద్వారా అందే స్వచ్ఛ వాయువు పచ్చదనం, తదితర అంశాలను రేంజ్ అధికారి వివరించారు. అదేవిధంగా ఔషధ మొక్కల గురించి వాటి ఉపయోగాలు గురించి కూడా వివరించారు. ఆక్సిజన్ పార్కులో విద్యార్థులకు పలు విషయాలను ఆక్సిజన్ గురించి, కాలుష్యం గురించి వివరించారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ గౌడ్, ఇన్‌చార్జి తిరుపతిగౌడ్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి రవి , బీట్ అధికారి ముజీబొద్దీన్ ఉపాధ్యాయులు ఉన్నారు.

యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమావేశం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కొండాపూర్ యాప గ్రామ పంచాయతీలోని రైస్ మిల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ అధ్యక్షతన యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇటీవల యువజన కాంగ్రెస్ ఎన్నికలలో గెలుపొందిన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రావుల అనిల్, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చల్లగొండ రాజ్ కుమార్, కాసిపేట మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్, బెల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ సొప్పరి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఇమ్ము, జిల్లా కార్యదర్శులు భుక్య సాయి పున్నం, భోగ శ్రావణ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్ మంచ్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ బాబు, మైనార్టీ మండల అధ్యక్షుడు శాకీర్, యాప గ్రామ అధ్యక్షుడు చారి, ధర్మరావుపేట గ్రామ అధ్యక్షుడు గోపే శ్రీను, కనక రాజు, చిలుకయ్య, పంబల తిరుపతి, శ్రీధర్, నరేష్, రాజు పాల్గొన్నారు.

పింఛన్ అందక ఇబ్బందులు

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు నేటికీ చాలా మందికి పింఛను అందడం లేదు. దీనితో వారికి ఆర్థిక పరంగా ఇబ్బంది తప్పడం లేదు. రెండేండ్ల కింద కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటి వరకు పింఛను అందడం లేదని వారు వాపోతున్నారు. కార్యాలయంలో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గత ప్రభుత్వం హయంలో వికలాంగులకు సదరం క్యాంపులో సర్టిఫికేట్ పొంది దరఖాస్తు చేసుకున్నప్పటి వరకు పింఛన్ అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారిన నేటికీ పింఛను రాక ఆర్థిక పరంగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి, పింఛన్ వచ్చేట్టు చూడాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేసి రెండేండ్లు అయ్యింది

కుష్మెత బాపూరావు వికలాంగుడు, తాడిహత్నూర్



ఎంపీడీఓ కార్యాలయంలో పింఛను కోసం దరఖాస్తు చేసి రెండేండ్లు గడచింది. నేటికీ పింఛన్ అందడం లేదు. దీనితో ఆర్థిక పరంగా ఇబ్బంది పడుతున్నాం. నేను వికలాంగుడిని కావడంతో పని కాక కుటుంబ పోషణ భారమవుతుంది. భార్య కూలీ పని చేసి నాతో పాటు కొడుకు, కూతురును పోషిస్తోంది. పేద కుటుబం కావడంతో ఆర్థిక పరంగా చాలా ఇబ్బంది పడుతున్నా. అధికారులు స్పందించి, వెంటనే పింఛన్ వచ్చేట్టు చూడాలి.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పిట్ల రాములు(30) శనివారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు ప్రతిరోజు ఉదయం నుంచి మద్యం తాగితూ ఉండేవాడని అదేవిధంగా శనివారం కూడా అతిగా మద్యం తాగి మద్యం మత్తులోనే ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారిలో యువకులే ఎక్కువ...

సంవత్సర కాలంలోనే గ్రామంలో 20 నుంచి 25 మంది మద్యానికి బానిసై అనారోగ్యంతో కొందరు మరణించగా, కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో మహారాష్ట్ర మద్యంతో పాటు తెలంగాణ రాష్ట్ర మద్యాన్ని 18 మంది వరకు విక్రయాలు జరుపుతున్నట్టు గ్రామస్తులు తెలిపారు. 30, 40 సంవత్సరాల లోపు వారే వితంతువులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ కూతవేటు దూరంలోనే ఇంటికో బెల్టు దుకాణం అక్రమంగా మద్యం జరుపుతుంటే సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోరా అని పశ్నిస్తున్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిన తర్వాత గ్రామంలో మద్యం నివారిస్తారా అంటూ గ్రామానికి చెందిన జువ్వాక నర్సింగ్, బాతూరి నర్సింలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు గ్రామంలో మద్యాన్ని నివారించాలని కోరారు.

కొనసాగుతున్న కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కొనసాగుతుందని అనిమానితులు పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానంద్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయా కాలనీల్లో కొనసాగుతున్న లెప్రసీ గుర్తింపు సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో భాగంగా కుటుంబ సభ్యులందరిని తప్పనిసరిగా పరీక్షించాలని సిబ్బందికి సూచించారు. అనిమానితులను తమతమ పీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. 2027 నాటికి భారత దేశాన్ని కుష్టురహితంగా తిర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందులో భాగంగానే ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి పారామెడికల్ అధికారులు వామన్‌రావు, రమేష్, సీఓలు రణిత, నవీన్, ఏఎన్ఎంలు హరిత, లత, ఆశా కార్యకర్తలు అర్చన, లక్ష్మీ, స్వరూప పాల్గొన్నారు.

కొడిచర్లలో పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం

నవతెలంగాణ-మెండోరా

మెండోరా మండలంలోని కోడిచర్ల గ్రామంలో ధ్యాన దంపతులు పడిగెల రాజవ్వ లింగారెడ్డి నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరాన్ని శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణ మహారాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మూగజీవాల సంరక్షణ కోసం అహింసాయుత మహాకరుణ శాఖాహార ర్యాలీని గ్రామంలో ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. అనంతరం పిట్ల కృష్ణ మహారాజు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, గురువులను పూజించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి జ్ఞానం పొందాలని, ధ్యానం ద్వారానే ప్రజలందరూ జీవితంలో సంతోషంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, పిరమిడ్ నిర్మాణ కర్తలు పరిగెల రాజవ్వ లింగారెడ్డి, పిఎస్ఎస్ఎమ్ బాధ్యులు బొడ్డు దయానంద్, సుఖాల లక్ష్మణ్, మామిడి లక్ష్మారెడ్డి, ప్రేమ్‌కుమార్, అమరవాజీ శ్రీనివాస్, మల్లారం సాయినాథ్, పిరమిడ్ మాస్టర్లు నాగంపేట్ శ్రీనివాస్, బోదేపల్లి రాజు, డికొండ శ్రీనివాస్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.